క్లుప్తంగా

చెట్లే మానవాళికి ప్రాణాధారం



మొక్కకు నీరు పోస్తున్న సర్పంచ్ ముసల్‌రెడ్డి

చిన్నమండెం : చెట్లే మానవాళికి ప్రాణాధారమని వండాడి గ్రామ సర్పంచ్ ముసల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వండాడి డంపింగ్ యార్డు ప్రాంగణంలో శుక్రవారం సర్పంచ్ ముసల్‌రెడ్డి చెట్లను నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు పరిసరాలలో తమ వంతుగా చెట్లను నాటించామన్నారు. పర్యావరణానికి చెట్లు ఎంతో దోహదపడతాయనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునంద, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



యర్రగుంట్లలో పరీక్ష కేంద్రం వద్ద వేచిఉన్న విద్యార్థులు

సంబేపల్లె : మండల పరిధిలోని యర్రగుంట సమీపంలో ఉన్న బాలయోగి గురుకుల కళాశాలలో శుక్రవారం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షాకేంద్రంలో సంబేపల్లె, చిన్నమండెం ఆదర్శ కళాశాలలు, దేవపట్ల, యర్రగుంట్ల కళాశాలలకు సంబంధించి 255 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 254 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. మిగిలిన 1 విద్యార్థి హాజరుకాలేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు ఆయన తెలిపారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న అల్లాబకాష్

రాయచోటి టౌన్ : పవిత్ర రంజాన్ మాసంలో యువకులు ఉపవాసం ఉంటూ రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్, బ్లడ్ మోటివేటర్ డాక్టర్ మైనుద్దీన్ చెప్పారు. గురువారం అర్ధరాత్రి సమయంలో రామాపురం మండలానికి చెందిన రోజా అనే మహిళకు అత్యవసరంగా రక్తం కావాలని కోరిన వెంటనే అల్లాబకాష్ అనే డిగ్రీ చదువుతున్న విద్యార్థి (ఉపవాస దీక్షలో ఉండగా) రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా బాధితులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ రిజ్వాన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. పాస్‌పోర్టు, వీసాల నిరభ్యంతర అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. 55 సంవత్సరాలు పైబడిన మహిళా ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వికలాంగులకు పదవ తగరతి పరీక్షల ఇన్విజిలేషన్, మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, శ్రీనివాసులరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ (13 రోజులు)లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఏప్రిల్ 3వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏప్రిల్ 5న రవాణా రంగ పరిరక్షణ కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రవాణా రంగం ప్రజలకు సరుకులను రవాణా చేస్తూ ప్రజల అవసరాలు తీరుస్తోందన్నారు. రవాణా రంగంలోని డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.



రాహుకాల పూజల్లో పాల్గొన్న భక్తులు

అమ్మవారికి రాహుకాల పూజలు

భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అర్చకులు అమ్మవారికి రాహుకాల పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి, రంగురంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

– రాయచోటి టౌన్



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాహుల్ గాంధీపై కక్ష గట్టడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో రాహుల్ గాంధీపై అక్రమ కేసులకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కడప పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

– పలు పాఠశాలల్లో పది విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం
– సర్వసతి పూజ నిర్వహించి విద్యార్థులకు హాల్‌టికెట్ల అందజేత

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశ నుంచి బాగా కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పేర్కొన్నారు. శుక్రవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల విధానం గురించి పరీక్షలు ఎలా ఎదుర్కోవాలి మంచి మార్కులు సాధించే విధానంపై విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జమ్రుత్‌బేగం, మురళీ నాయక్, భారతీ, శ్రీనివాసులు, ప్రసాద్, అరుణ్ కుమారి, శ్రీకళ, సుధీర్ కుమార్, సోమశేఖర్ నాయక్, రసూల్, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు

రామాపురం : వచ్చే ఏప్రిల్ మాసంలో జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షామీర్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య చాలా ముఖ్యమైందని, విద్యార్థులందరూ బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. పదవ తరగతిలో 500 మార్కులోపైబడి తెచ్చిన విద్యార్థులందరికీ రూ10,116లు నగదును బహుమతిగా అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విందు భోజనాన్ని పాఠశాల చైర్మన్ గంగిరెడ్డి ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వాణిలకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, ఆంజనేయులు, రంగరామానుజం, వెంకటరమణ, రాజు, ఆంజనేయులు, యూసుఫ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



పుల్లంపేట: విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేసిన దృశ్యం

ఘనంగా సరస్వతి పూజ

పుల్లంపేట : మండలంలోని పీవీజీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సరస్వతి పూజను నిర్వహించి విద్యార్థులకు హాల్ టికెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ముందుగా గణపతి అష్టోత్తర శతనామావళి తర్వాత సరస్వతి దేవి అష్టోత్తర శతనామావళిని విద్యార్థులచే పలికించి భక్తి శ్రద్ధలతో పూజ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు వారివారి పాఠ్యాంశాలలో ఏయే మెళకువలను పాటించాలో విద్యార్థులకు సూచించారు. పరీక్షలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు రెడ్డి ప్రసాద్, శివశంకర్ రాజు, వెంకటరమణ, సుజిత, భారతి, శ్రీనివాసులు, చంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తీర్ణత సాధించాలి

సంబేపల్లె : మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామక్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మొదటిమెట్టు పదవతరగతి అన్నారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామగ్రిని అందజేశారు. అనంతరం విద్యార్థులు పదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



రామాపురం: విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు



సంబేపల్లె: విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

సుస్థిర పాలనలో ఆదర్శంగా కోడూరు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణాన్ని అనేక సదుపాయాలు కల్పించి అభివృద్ధి, సమానత్వం, సుస్థిర పాలనలో కోడూరును ఆదర్శంగా తీర్చిదిద్దామని సర్పంచ్ బుడిగి శివయ్య, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో రైల్వేకోడూరు పట్టణంలో ఇప్పటివరకు సుమారు రూ.57 కోట్లకు సంబంధించి పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో కొన్ని పనులు పూర్తవ్వగా, మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పంచాయతీకి మంజూరైన నిధులను మౌలిక వసతుల కల్పనకు, పట్టణ సుందరీకరణకు కేటాయించామన్నారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశించిన ప్రతి అభివృద్ధి పనిని చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అన్వర్‌బాషా, గునిశెట్టి రమేష్, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, రత్తయ్య, కరీముల్లా, చందు, దొంతిరెడ్డి రాజారెడ్డి, శివ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ తదితరులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థికసాయం

– ఒక్కొక్కరికి రూ.50వేలు అందజేసిన వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : ప్రమాదంలో గాయపడిన వారికి మండల వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి ఆర్థికసాయం చేసి బాధిత కుటుంబసభ్యులకు అండగా నిలిచారు. వివరాలు ఈ నెల 21న మండలంలోని జంగాపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలెం లక్ష్మమ్మ, కోటపాటి ఓబులమ్మలను శుక్రవారం కడపలోని వేరువేరు ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వారిని కలిసి పరామర్శించారు. అనంతరం వారివారి కుటుంబసభ్యులకు రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జి.ఎల్లారెడ్డి, యువనాయకుడు క్రిష్ణచైతన్య, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డి, రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కుప్పం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి

స్మశానవాటికలకు స్థలాలు కేటాయించండి

రాయచోటి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన తండాలతో పాటు షికారుపాళెం గిరిజనులకు స్మశాన వాటికల నిర్మాణానికి వెంటనే స్థలాలు కేటాయించాలని జేసీ తమీమ్ అన్సారియాను శుక్రవారం గిరిజన సమాఖ్యనేతలు విన్నవించారు. గిరిజన సమాఖ్య జిల్లానేత విశ్వనాథనాయక్, లంబాడా సంఘం జాతీయనేత శంకర్‌నాయక్‌లు గిరిజనులతో కలసి జేసీని ఆమె చాంబర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల ప్రజలకు స్మశానవాటిక స్థలాలు లేవని, ఎవరైన చనిపోతే స్థలం లేక వాగులు, వంకలలో పూడ్చిపెట్టుకోవలసి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలకు స్మశానవాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను కేటాయించాలంటూ కోరారు. కార్యక్రమంలో గిరిజన నేతలు పీనుజీ నాయక్, రాజారాం, దేవరాజు, సుబ్బయ్య, బాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజన సంఘాల నేతలు

పురాతన ఆలయాలను పరిరక్షించుకుందాం

చిట్వేలి : మట్లిరాజుల కాలంలో నిర్మితమైన పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని దేవదాయశాఖ అధికారి విశ్వనాథం పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ శ్యామలాంబ సమేత సోమేస్వరస్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి, వరదరాజస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను స్థానికులతో కలిసి దేవాదాయశాఖ అధికారి విశ్వనాథం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల భూములు, ఆక్రమణలపై తహసీల్దార్‌తో కలిసి సర్వే చేయించి విచారణ జరిపిస్తామన్నారు. భూములు కౌలు సమయం ముగియడంతో దండోరా వేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సతీష్ శర్మ, అరవింద శర్మ, మణికంఠ, పాత చిట్వేలి యువత పాల్గొన్నారు.



ఆలయ భూముల ఆక్రమణలను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

టీబీ నిర్మూలనే ధ్యేయంగా ముందుకెళ్లాలి

– డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.చెన్నకృష్ణ

రాజంపేట రూరల్ : టీబీ నిర్మూలన ధ్యేయంగా ప్రతి ఒక్కరు ముందుకెళ్లామని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డా.చెన్నకృష్ణ అన్నారు. శుక్రవారం రాజంపేటలో టీబీ మెడికల్ ఆఫీసర్ సృజన ఆధ్వర్యంలో చేపట్టిన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. డా.శేఖర్ మాట్లాడుతూ రెండువారాల మించి దగ్గు, రాత్రి పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం ఈ లక్షణాలున్న వారు దగ్గరిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ వైద్యురాలు సృజన మాట్లాడుతూ ప్రతి ఒక్క టీబీ రోగి ఆశ వర్కర్ పర్యవేక్షణలో మందులు తింటారన్నారు. ఆరునెలలు మందులు సక్రమంగా మింగితే టీబీ పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో పీపీ హెల్త్ సెంటర్స్ వైద్యులు లక్ష్మిప్రసన్న, వికాస్, కుష్టు వ్యాధి వైద్యాధికారిణి సౌజన్య, వైద్యులు అశోక్, రెహానా, పిల్లి పిచ్చయ్య, టీబీ సూపర్‌వైజరు జయప్రకాశ్, సూపర్‌వైజర్స్ గుర్రప్ప, రవిరాజు, చంద్రశేఖర్, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ జగన్, శివరాం, ప్రియాంక నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా.చెన్నకృష్ణ

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాధవరం– 2, ఉప్పరపల్లె గ్రామ సచివాలయాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయాల్లోని 22 రకాల రిజిస్టర్‌లను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధుల్లో ఏకరూప దుస్తులను ధరించాలని, వలంటీర్లు వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, సుజాత, లక్ష్మీనరసయ్య, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించాం

రాజంపేట : ఏడాది కాలంగా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించామని బార్ అసోసియేషన్ తాజా మాజీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ఆనంద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం విషయంలో గత నెల 14వతేదీ జరిగిన మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు 17వతేదీ లోపు డబ్బులు చెల్లించి సంతకం చేసి రసీదు పొందాలని నోటీసు బోర్డులో వేశామన్నారు. 102 మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారన్నారు. అంతేగాని ఎవరిని తీసివేయలేదన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో బయటి వ్యక్తుల ప్రమేయాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ, డీఎస్పీలు జోక్యం చేసుకోవాలని యువ న్యాయవాదులు విన్నవించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో యువ న్యాయవాదులు గిరీష్‌కుమార్, భరత్ రెడ్డి, మస్తాన్, సురేష్, శివ తదితరులున్నారు. నిత్యం కోర్టుకు హాజరవుతూ వృత్తిని నమ్ముకున్న యువన్యాయవాదులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో పాల్గొనివ్వకుండా కొంతమంది న్యాయవాదులు ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

విచారణకు హాజరైన వస్త్ర వ్యాపారులు

సిద్దవటం : డీకేటీ భూమిలో అక్రమ భవన నిర్మాణంతోపాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించారనే ఆరోపణతో ఉప్పరపల్లె గ్రామానికి చెందిన 10 మంది వస్త్ర వ్యాపారులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విచారణకు హాజరయ్యారు. విచారణపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ క్రిష్ణ మాట్లాడుతూ విచారణకు హాజరైన వారి వద్ద ఉన్న దస్త్రాలను తీసుకున్నామని తెలిపారు. అలాగే వస్త్ర వ్యాపారస్తుల నుంచి ఉప్పరపల్లె వీఆర్ఓ స్టేట్‌మెంటు రికార్డు చేశారని పేర్కొన్నారు. వారు సమర్పించిన దస్త్రాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు.



విచారణకు హాజరైన వస్త్ర వ్యాపారులు

వైభవంగా కల్యాణోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారి పక్కన కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణమహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని జరిపారు. మూలవిరాట్‌లకు అర్చన అభిషేక తదితర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చలివేంద్రం ప్రారంభం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీంలో ఉన్న సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దీపం లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణీకులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకే ఆర్ఓ వాటర్ చలివేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సుజాత, డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, గ్రామ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బయ్య, మార్కెట్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నగదును అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లి దళితవాడలో శుక్రవారం సర్పంచ్ అరవ శ్రీధర్ వైఎస్సార్ బీమా తక్షణ సహాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన పులి చంద్ర గుండెపోటుతో మృతి చెందాడు. తక్షణ సహాయార్థం రూ. 10 వేల నగదును మృతుని భార్య పులి రమణమ్మకు అందజేశారు. బీమా మొత్తం రూ. 1లక్షలు కాగా రూ. 10 వేలు మృతుని కుటుంబానికి అందజేశామని వెల్ఫేర్ అసిస్టెంట్ సౌజన్య తెలిపారు.

జెడ్పీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎస్ఎస్ఏ ప్రాజెక్టర్ డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి, పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. తనిఖీ అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అంతేగాకుండా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో చేపట్టవలసిన సూచనలు, సలహాలు, మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

వీరబల్లి : ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ నాయకుడు శ్రీధర్ రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. చికిత్సలకు సుమారు రెండు వందల మంది హాజరు కాగా ఆపరేషన్‌కు 30 మంది ఎంపికయ్యారని, వీరిని కడపలోని భారతి హాస్పిటల్‌కు ఉచిత బస్సు సౌకర్యం, భోజన వసతి కల్పించి ఆపరేషన్ అనంతరం వారిని తిరిగి వారివారి ఇళ్లకు చేర్చుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న కళాశాల వారిని అభినందించారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎస్‌డీకేఆర్ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కంటి జబ్బులతో బాధపడేవారు ఉండకూడదనే నెపంతో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు శ్రీధర్ రెడ్డి మజ్జిగ, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, డాక్టర్ శివతేజ రెడ్డి, ఐక్యాంప్ మేనేజర్ కిషోర్ రాజు, స్థానిక నాయకులు నాగూర్ రెడ్డి, తుమ్మల రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

సంబేపల్లె : నేషనల్ మీన్స్, మెరిట్ స్కాలషిప్‌కు సంబేపల్లె ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్. జాఫర్‌వలీ, కె.తేజలు ఎంపికైనట్లు ప్రిన్స్‌పల్ దిలీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు అందుకుంటారని ఆయన తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు